
ప్రజాశక్తి
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025
5
పార్వతీపురం మన్యం



స్కిల్ కాలేజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో నిర్వహించనున్న స్కిల్ కాలేజ్‌లో ఉచిత కంప్యూటర్, ఇంగ్లీష్ శిక్షణ, ప్లేస్మెంట్ కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు స్కిల్ కాలేజ్ కోఆర్డినేటర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎ పరిధిలోని వైటిసిలో స్కిల్ కాలేజ్‌లో 4 నెలలు ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయం ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి కూడా కల్పిస్తామన్నారు. దీని కోసం ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన అభ్యర్థులంతా అర్హులేనన్నారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు మార్చి 12లోపు వారు తమ డాక్యుమెంట్లు తీసుకొని వైటిసికి తీసుకొనిరావాలని కోరారు. టూరిజం, ఐటి, సాఫ్ట్‌వేర్ హాస్పిటల్ మొదలగు ట్రేడుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 7032060773, 6303464426 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నిక

93.74శాతం పోలింగ్ నమోదు

మక్కువలో వంద శాతం

పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలో గురువారం జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 15 బూతుల్లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో 2333 మంది ఉపాధ్యాయుల ఓట్లకు గానూ 2187 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా జిల్లా మొత్తంగా 93.74 శాతం ఓటింగ్ నమోదైంది. అందులో 1,574 మంది పురుషులు, 759 మహిళా ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఉదయం 10.00 గం.ల నాటికి 15.39 పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం 12.00గం.లకు 60.65 శాతం, 2.00గం.లకు 85.60, సాయంత్రం 4.00గం.ల సమయానికి 1474 మంది పురుషులు, 713 మంది మహిళలు వెరసి 2,187 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జెసి ఎస్.ఎస్.శోబిక, డిఆర్ఒ.హేమలత కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. మక్కువ మండలంలో వందశాతం పోలింగ్ నమోదైంది. జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 45వ బూతును సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి కూడా ఎన్నిక ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని జిల్లా సమీక్షించి, జిల్లావ్యాప్తంగా ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగుతుందని ఇంత వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు సమాచారం లేదని తెలిపారు. పోలింగ్ అనంతరం 15 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులు వచ్చిన వెంటనే విశాఖపట్నం కలెక్టరేట్ కార్యాలయంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపడంనున్నట్టు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అలాగే పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి పార్వతీపురం, సాలూరు, సీతానగరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



పోలింగ్ అనంతరం చేపడుతున్న ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి, డిఆర్ఒ

ఎన్నికల సహాయక శిబిరాల హడావిడి

పార్వతీపురం అన్న క్యాంటీన్ ఎదురుగా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పిడిఎఫ్‌తో పాటుగా కూటమి అభ్యర్థి బలపరిచిన అభ్యర్థికి మద్దతుగా ఓటింగ్ సహాయక శిబిరాలు వెలశాయి. దీంతో ఆ ప్రదేశమంతా సందడిగా మారింది, ఓటేసేందుకు వెళ్తున్న ఉపాధ్యాయ ఓటర్లను పలకరిస్తూ తమ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలని కోరారు. ఓటింగ్ సరళిని పరిశీలించిన తర్వాత గెలుపు తమదేనంటూ ధీమాను వ్యక్తంచేస్తున్నారు. ఏదిఏమైనాప్పటికీ అభ్యర్థుల జాతకాలు బ్యాలెట్ బాక్సుల్లో భద్రపరిచి కలెక్టరేట్‌కు తరలిస్తున్నారు. మరొక రెండు రోజుల్లో విజయం ఎవరిని వరిస్తుందో తెలవనుంది.



పార్వతీపురంలో ఓటేసేందుకు క్యూలో ఉన్న ఉపాధ్యాయులు


పోలింగ్ కేంద్రం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1. పార్వతీపురం	636	591	92.92
2. వీరఘట్టం	120	117	97.50
3. సీతంపేట	121	116	95.87
4. భామిని	44	42	95.45
5. పాలకొండ	301	283	94.02
6. కొమరాడ	65	63	96.92
7. గుమ్మలక్ష్మీపురం	189	183	96.83
8. కురుపాం	120	112	93.33
9. గరుగుబిల్లి	105	95	90.48
10. జియ్యమ్మవలస	91	78	85.71
11. మక్కువ	55	55	100
12. సీతానగరం	114	111	97.37
13. బలిజిపేట	88	81	92.05
14. సాలూరు	250	228	91.20
15. పాచిపెంట	34	32	94.12
మొత్తం	2333	2187	93.74



పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి



సీతానగరంలో ఎన్నికల శిబిరం వద్ద పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

పెరిగిన పోలింగ్ శాతం

ప్రభుత్వ వ్యతిరేకతకు సంకేతమా?

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెరిగిన పోలింగ్ శాతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతకు సంకేతంలా కనిపిస్తోంది. గురువారం నిర్వహించిన పోలింగ్‌లో 2187మంది (93.74 శాతం) ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకు న్నారు. నిశ్శబ్ద విప్లవంలా ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తరలి వచ్చి ఓటేశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో అధికారపార్టీ నాయకులు నేరుగా రంగంలోకి దిగి పలానా ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం ఇంతవరకు చూడలేదు. ఎపిటిఎఫ్ అభ్యర్థి కోసం జిల్లాలోని మంత్రితో సహా ముగ్గురు ఎమ్మెల్యేలు శక్తివంచన లేకుండా పనిచేశారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి టిడిపి కూటమి పార్టీలు మద్దతు పలికిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరడం చర్చనీయాంశమైంది. తమను గెలిపించిన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ప్రయోజనాలు, హక్కుల కోసం పోరాడడమే లక్ష్యంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఇంతవరకు పని చేశారు. ఇప్పటికీ పని చేస్తున్నారు. ఈ విధానం గిట్టని పాలక పార్టీలు ఆదిలోనే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఓడిస్తే విధాన మండలిలో తమకు ఎదురుండదని భావించి కుతంత్రాలకు తెరలేపారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపి పోరాటపంథా అనుసరించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీ లేనన్న విషయం ఆయా వర్గాలకు బాగా తెలుసు. ప్రస్తుతం ఎన్నికల బరిలో పది మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ పోటీ మాత్రం ముగ్గురు మధ్యనే సాగింది. పిడిఎఫ్ అభ్యర్థి కోరేడ్ల విజయ గౌరి, ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, పిఆర్ టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు మధ్యనే ఎమ్మెల్సీ యుద్ధం జరిగింది. రఘువర్మ, శ్రీనివాసుల నాయుడు పని తీరు, సమస్యల పరిష్కారానికి చూపే చొరవ, పోరాట పటిమ ఏమిటో మేథావులైన గురువులకు తెలుసు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలి గా విజయగౌరి అనేక సందర్భాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చూపిన చొరవ, పోరాట పంథాను కళ్ళారా చూసిన ఉపాధ్యాయులు, అధ్యాప కులు తగిన సమయం కోసం ఎదురు చూశారు. పాలకపార్టీల మద్దతుతో బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా లెక్క చేయకుండా తాము కోరుకున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరేడ్ల విజయగౌరినే గెలిపించేందుకు నిశ్శబ్ద విప్లవంలా ఓటేశారనేది తెలుస్తోంది. ఎన్నికల పోలింగ్ సరళి నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వ వ్యతిరేకతను ఉపాధ్యాయులు ఓటింగ్ రూపంలో చూపించారనే చర్చ జరుగుతోంది.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పదో తరగతి పరీక్షల్లో శ్రద్ధగా చదివి విద్యార్థులంతా శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆకాంక్షించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉత్తీర్ణత సాధించాలన్న తపన, పట్టుదలతో చదవాలని సూచించారు. ఇక్కడ విద్యార్థులంతా బాగా చదువుతున్నారని వెరీ గుడ్ అని విద్యార్థులను ప్రసంశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. అక్కడి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, కరచాలనం చేసి నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల వసతి గృహం మరమ్మతులు చేపట్టిన తదుపరి అందుతున్న వసతుల పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు సానుకూల దృక్పథంతో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. బంగారు భవితకు పదోతరగతి, ఇంటర్ మీడియట్ కీలక మలుపునిస్తుందని, కావున ఏకాగ్రతతో చదువే ధ్యాసగా శ్రమించాలని పేర్కొన్నారు. పాఠ్యాంశాల్లో ఉన్న అనుమానాలను ఎప్పటి కప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదవాలంటే ఆరోగ్యంగా ఉండాలని, అనీమియా పరీక్షలు చేయించుకొని, హిమోగ్లోబిన్ 11 శాతం కంటే తక్కువ లేకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భవిత కార్డుల్లో విద్యార్థుల ఆరోగ్య వివరాలను నమోదుచేయాలని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధ్యాపకులను ఆదేశించారు. ఈ పర్యటనలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

మళ్లీ ఏనుగులు హల్‌చల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలంలోని పంటలపై ఏనుగుల విధ్వంసం కొనసాగుతూనేవుంది. వివరాలలోకి వెళ్తే గత మూడు రోజులుగా పెదమేరంగి కూడలికి ఆనుకొని ఉన్న జొన్నచేలు, వరినారు మళ్లలోని తిష్టవేసిన ఏనుగుల గుంపు గురువారం ఉదయం నుంచి గవరంపేట, కన్నపుదొరవలస పంచాయతీల పరిధిలో గల వెంకటరాజ పురం, సుభద్రమ్మ వలస గ్రామాలకు చెందిన రైతులు మరడాన తిరుమలరావు, మరడాన మధు, మల్లిమ కృష్ణమూర్తి తదితర రైతులు వేసిన జొన్నచేను, వరినారు మడులను ధ్వంసం చేశాయి. ధ్వంసం చేసిన పంటను చూసి తీవ్ర ఆందోళన చెందుతున్న రైతులు ఏనుగుల గుంపును ఇక్కడి నుండి తరలించాలని, నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలని అధికారులను, ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు.



విజన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించేనా?

- అసంపూర్తిగా సాగునీటి ప్రాజెక్టులు
- వెంటాడుతున్న పారిశ్రామిక వెనుకబాటు
- మౌలిక సౌకర్యాలు, సేవారంగ అభివృద్ధీ అంతమాత్రమే
- నేడే రాష్ట్ర బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యవసాయ ఆధారితమైనది. ఈ మాటకొస్తే కేవలం వ్యవసాయ రంగం మాత్రమే కాదు, ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా నీటి వనరులు అత్యంత కీలకం. నీరుంటే పంటలు పండుతాయి. నీరు లేకుండా పరిశ్రమల స్థాపన, వాటి మనుగడ కూడా అసాధ్యం. చివరికి సేవా రంగంలో రోడ్లు వేయాలన్నా, భవనాలు నిర్మించాలన్నా, హోటళ్లు, తదితర వ్యాపార లావాదేవీలు సాగించాలన్నా నీరే కీలకం. ఇంతటి ప్రాధాన్యతగల నీటి వనరుల అభివృద్ధికి నోచుకోవడం లేదు. తోటపల్లి, రామతీర్థసాగర్, జంఝావతి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి. వీటితోపాటు ఆండ్ర, పెద్దగెడ్డ, తాటిపూడి, వెంగళరాయసాగర్, వట్టిగెడ్డ, పెదంకలాం తదితర జలాశయాలు ఉన్నాయి. వీటికి తగినంతగా బడ్జెట్ కేటాయించడం లేదు. ముఖ్యంగా తోటపల్లి జలాశయం ద్వారా 64 వేల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరిస్తూనే, కుడి కాలువ ద్వారా అదనంగా 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు ఇప్పటికీ సగం విస్తీర్ణానికే నీరందిస్తోంది. ఏటా అరకొర నిధులు కేటాయించి, వాటిని కూడా ఖర్చు చేయకపోవడమే కారణం. గత ఏడాది కాలువల నిర్మాణాలు, ఇతర పనుల కోసం రూ.279.96 కోట్లు, భూసేకరణకు రూ.55.81 కోట్లు, నష్ట పరిహారం, పునరావాసం కోసం రూ.119.10 కోట్లు, ని ఎ డి డ బ్ల్యు ఎం క ు రూ.110.06 కోట్లు, నిర్వహణకు రూ.65 లక్షలు.. చొప్పున మొత్తం రూ.565.58 కోట్లు అవసరం కానున్నట్టు తోటపల్లి ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే, కేవలం రూ.36.85 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో పనులకు రూ.25.84 కోట్లు, భూసేకరణకు రూ.6.21 కోట్లు, నష్టపరిహారం, పునరావాసం, సిఎడిడబ్ల్యుఎంలకు రూ.4.80 కోట్లు కేటాయించినట్టు బడ్జెట్ పత్రాల్లో పేర్కొంది. తీరా నిధులు విడుదల చూస్తే అరకొరగానే ఉంది. రామతీర్థసాగర్ పనులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ముందుకు సాగడం లేదు. 24వేల ఎకరాలకు సాగునీరు, విజయ నగరానికి తాగునీరు, ఇటీవల భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు నీటి సదుపాయం కోసం లక్ష్యంగా తలపెట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.533.18 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. కేటాయించింది కేవలం రూ.28 కోట్లు మాత్రమే. ఇది ఏ మూలకూ సరిపోని పరిస్థితి నెలకొంది.

ప్రణాళిక సాధనలో ప్రణాళిక చాలా గొప్పదే. కానీ, ఆచరించని ప్రణాళిక ఎంత గొప్పదైనా అది గుడ్డిదే అవుతుంది. ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరిగేందెంతో. దీనిపై ప్రస్తుతం సర్వత్రా చర్చనడుస్తోంది. ఈనెల 28న జరగనున్న అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అభివృద్ధి, వెనుకబాటు, వనరులు, వాటి వినియోగం తదితర వాటిపై చర్చ నడుస్తోంది.

ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేసేందుకు తలపెట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కేటాయించిన నిధులు అక్షరాల అరవై మూడు రూ.కోట్లకు మించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో జల వనరులకు రూ.16,743 కోట్లు కేటాయించగా, అందులో మన జిల్లా వాటా ఇచ్చింది రూ.64 కోట్లు కావడం ప్రభుత్వ వివక్షతకు అద్దం పట్టింది. నీటి వనరులకే నిధులు కేటాయించని ప్రభుత్వం జిల్లా ప్రగతిని పరుగులు పెట్టిస్తుందంటే నమ్మేదెట్టా? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

ఇక గిరిజన, మత్స్యకార ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు ఎండమావిగానే ఉంటోంది. దీంతో, వైద్యసేవల కోసం నిత్యం డోలి మోతలు తప్పడం లేదు. మత్స్యకారులకు గత ఏడాది వేట నిషేధ సమయంలో అందజేయాల్సిన ఆర్థిక సాయం ఇప్పటికీ ఇవ్వలేదు. జిల్లాలోని జీడిపిక్కలు, ఫెర్రో ఎల్లాయిస్, జూట్ పరిశ్రమలు మూతపడ్డాయి. మరోవైపు నియోజకవర్గానికి ఒక ఎంఎస్‌ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. ఈ విజన్ అంతా నెరవేరాలంటే ఉమ్మడి విజయనగరం జిల్లాకు చిత్తశుద్ధితో నిధులు కేటాయించడం ద్వారానే సాధ్యమౌతుంది. ఆచరణలో ఏ విధంగా ఉంటుందో శుక్రవారం నాటి బడ్జెట్ సమావేశంలో తేలనుంది.

గుంపయాత్రకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - కొమరాడ

మహాశివరాత్రి సందర్భంగా గుంప యాత్రకు భక్తులు భారీగా తరలి వచ్చారు. గురువారం రెండో రోజు యాత్ర సందర్భంగా పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు ఒడిశా నుంచి పార్వతీపురం, బొబ్బిలి తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వచ్చారు. జంఝావతి, నాగావళి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వర ఆలయం వద్ద భక్తులు నదిలో స్నానాలు చేశారు. యాత్ర సందర్భంగా భక్తులు కుటుంబ సభ్యులతో సహా నదిలో స్నానాలు చేస్తూ ఆడుతూ పాడుతూ కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు.



నదిలో స్నానాలు చేస్తున్న యాత్రికులు

ఆయన నేత్రాలు సజీవం

ప్రజాశక్తి - మక్కువ

తాను మరణించిన ఇంకొకరికి చూపును ప్రసాదించడంతోపాటు తనవారికి కూడా జ్ఞాపకాలు నిలిచిపోయేలా కొల్లి రమణ కుటుంబీకులు తీసుకున్న అవయవ దాన నిర్ణయం పలువురికి ఆదర్శంగా నిలిచింది. మక్కువలోని యాదవ వీధికి చెందిన కొల్లి రమణ (59) గురువారం మృతి చెందారు. ఆయన తన కళ్లను అవయవ దానం చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో విశాఖకు చెందిన ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వారికి కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వగా రమణ కళ్ళను ఐ బ్యాంకు వారు తీసుకువెళ్లారు. అవయవ దానం చేసి అతని జ్ఞాపకాలు నిలిచి ఉండేలా తీసుకున్న నిర్ణయాన్ని పలువురు కొనియాడుతున్నారు.



నేత్రదాత రమణ

బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలి

1న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

పార్వతీపురం మన్యం జిల్లాకు బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరుతూ మార్చి1 జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్ వేణు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆయన గురువారం మాట్లాడుతూ మన్యం జిల్లా తీవ్ర అన్యాయానికి గురవుతుందని ఏ బడ్జెట్‌లోనూ సరైన కేటాయింపులు లేవని కనీసం జంఝావతి కూడా పూర్తి కాలేదని అన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజ్ లేదని, సూపర్ స్పెషల్ తాగునీరు లేదని అన్నారు. పార్వతీపురంలో బైపాస్ రోడ్డుకు హామీ ఇచ్చి అమలు చేయలేదని ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ ధర్నా జరుగుతుందన్నారు. ఆయన వెంట సిపిఎం మండల నాయకులు ఆర్ ఈశ్వరరావు, ఆర్ లక్ష్మీనాయుడు, జి వెంకటరమణ ఉన్నారు.

పార్వతీపురం: జిల్లా అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద మార్చి 1న ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్వై నాయుడు చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు అందరూ జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై, పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు ముందుకు తీసుకు వెళ్ళేందుకు నిధులు కేటాయించే విధంగా అసెంబ్లీలో ప్రస్తావన చేయాలని కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు పార్వతీపురం మన్యం జిల్లా తీవ్రమైన అన్యాయానికి గురైందని, పాలించిన వారు ఎవరైనప్పటికీ, సరా మామూలుగానే విధానాలు ఉన్నాయని చెప్పారు. సరైన కేటాయింపులు లేక, కేటాయించిన నిధులు ఖర్చు చేయక జిల్లా వెనుకబడి వుందని చెప్పారు. దీనికి ఉదాహరణ ఆనాటి జంఝావతి ప్రాజెక్టు పరిస్థితి నేటికీ అలాగనే ఉన్నదని గుర్తు చేశారు. జిల్లాకు రావలసిన ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు నేటికీ రాలేదని, పాలకులు ప్రశ్నించకపోవడమే కారణమని తెలిపారు. ఈ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మార్చి 1వ తేదీన మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, జిల్లాలోని ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్, నాయకులు ఎస్ అప్పారావు, బి సంగీత, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో కరపత్రాన్ని విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ఇసుక నిల్వలు పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గురువునాయుడుపేట గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వలు చేసిన ఇసుకను స్థానిక తహశీల్దార్ డి.రవి, సిబ్బంది గురువారం సాయంత్రం పట్టుకున్నారు. తహశీల్దార్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పాంచాలి వద్ద గల వట్టిగెడ్డ నుండి వాహనాల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేసి గురువునాయుడుపేట గ్రామ సమీపంలో ఇసుక అక్రమ నిల్వలు చేసి గురువు నాయుడుపేట నుండి రాత్రి సమయంలో విశాఖపట్నంకు తరలిస్తున్నారని తెలిపారు ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న పాంచాలికి చెందిన కేదారి పోలిరాజును పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు. పోలిరాజుపై కేసు నమోదు చేసి అక్రమ ఇసుక నిలవుల్ని సీజ్ చేస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు.



పాంచాలి వద్ద ఉన్న ఇసుక అక్రమ నిల్వలను పరిశీలిస్తున్న తహశీల్దార్

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్

ప్రజాశక్తి- సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం 47లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఈ పోలింగ్ కేంద్రంలో 114 మంది ఓటర్లు ఉండగా, 111 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఎఎస్‌పి అంకిత సురాన సందర్శించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 120 మంది ఓటర్లకు గాను 117మంది వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సందర్శించారు. పోలింగ్ పరిస్థితిని ఎన్నికల అధికారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటర్ల జాబితాను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు కూడా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి తగుసూచనలు అందజేశారు. వీరితో పాటు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, పాలకొండ సిఐ ఎం చంద్రమౌళి, స్థానిక ఎస్‌ఐ జి కళాధర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కురుపాం : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కురుపాంలో ప్రశాంతంగా ముగిసింది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభించి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. మండలంలో 120 మంది ఓటర్లు ఉండగా 112 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎఆర్‌డిఎస్‌పి ఎల్.శేషాద్రి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎల్విన్ పేట సిఐ బిహరి, ఎస్‌ఐ పి నారాయణరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

సీతంపేట: స్థానిక బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 121 మంది ఓటర్లకు గాను 116మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. డిఎస్‌పి ఎం.రాంబాబు, సిఐ చంద్రమౌళి బందోబస్తును పర్యవేక్షించారు. ఎస్ఐ అమ్మన్నరావు ఎటువంటి ఆ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించారు. కార్యక్రమంలో తహశీల్దారు అప్పలరాజు, ఆర్ఐ విజయ గణేష్ పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల పోలింగ్ శాతం నమోదయ్యాయి. మండలంలో 65 ఓట్లకు 65 పోలింగ్ అయినట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. ఫారం 16 ధ్రువ పత్రాన్ని ఎన్నికలు అధికారులు అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లకు అందజేశారు. పోలింగ్ స్టేషన్ సమీపంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠంలో 144 సెక్షన్ అమలు చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. అన్ని మండలాల్లోనూ ఉపాధ్యాయులంతా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఉత్సాహం చూపడంతో 93.74శాతం నమోదైంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు పరిశీలించారు. ఓటు వేసేందుకు ఉదయం 8 గంటల నుంచే ఉపాధ్యాయులు క్యూలైన్లో ఉత్సాహంగా కనిపించారు.

పాలకొండ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికస్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. మండలంలో 301మంది ఓట్లు ఉండగా 283 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 94 శాతం పోలింగ్ నమోదైంది. సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. అలాగే బయట అభ్యర్థుల తరఫున వేసుకున్న టెంటల్ దగ్గరికి వెళ్లి వెంటనే టెంట్లు తీయాలని హెచ్చరించారు. రెండు కుర్చీలకు మించి ఉండరాదని, ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ ఎన్నికల పర్యవేక్షణలో డిఎస్‌పి ఎం.రాంబాబు, తహశీల్దార్ పి.బాలమురళీకృష్ణ, సిహెచ్.చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి దగ్గరుండి ఎన్నికలను పర్యవేక్షించారు. కచ్చితంగా 144 సెక్షన్ అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కూటమి మద్దతుతో బరిలో ఉన్న రఘువర్మ ఇక్కడకు చేరుకొని ఎపిటిఎఫ్ నాయకులతో పాటు కూటమి నాయకులతో మాట్లాడారు. ఎపిటిఎఫ్ నాయకులు హై స్కూల్‌కు దగ్గర్లోనే ఓటు వేయడానికి వెళ్లిన ఓటర్లకు కలిసి ప్రచారం చేయడం పట్ల విమర్శలు వినిపించాయి.



పాలకొండలో ఓటు వినియోగించుకున్న ఉపాధ్యాయులు



సాలూరు : యుటిఎఫ్ శిబిరంలో ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న ఎఎస్‌పి సురాన

ఒక అభ్యర్థి మూడు శిబిరాలు

ఒక అభ్యర్థి మూడు శిబిరాలు... ఇదేంటి అనుకుంటున్నారా... మీరు చదివింది అక్షరాల నిజమే... ఎపిటిఎఫ్ మద్దతుతో కూటమి సహకారంతో బరిలో ఉన్న రఘువర్మ ఎన్నికకు మూడు టెంట్లు ఇక్కడ కనిపించాయి. ఎపిటిఎఫ్ తరఫున హై స్కూల్‌కు దగ్గర్లో ఉపాధ్యాయులు ఒక టెంట్ వేసుకోగా, దానికి ఎదురుగా ఎమ్మెల్యే జయకృష్ణ కు మద్దతుగా ఉన్న నేతలంతా మరో శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇదిలా ఉంటే కాంప్లెక్స్ దగ్గర్లో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ భూదేవి వర్గం మరో శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఒక అభ్యర్థికి మూడు టెంట్లు ఉండడం జరిగింది.

సాలూరు: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సాలూరు పట్టణం, మండలాలకు చెందిన ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 250 ఓట్లకు గాను 228 ఓట్లు పోలయ్యాయి. తహశీల్దార్ ఎస్‌వి రమణ, ఎంపిడిఒ జి.పార్వతి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షణ చేశారు. టౌన్ సిఐ బి.అప్పలనాయుడు ఆధ్వర్యాన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఎపిటిఎఫ్ శిబిరంలో మంత్రి

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నిర్వహించిన పోలింగ్ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఉదయం నుంచి ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ శిబిరంలో ఆశీనులయ్యారు. సాధారణ ఎన్నికల శిబిరంలో మాదిరిగా టిడిపి నాయకులు కార్యకర్తలను వెంట పెట్టుకొని శిబిరంలో సందడి చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ కూడా శిబిరంలో కొద్దిసేపు కూర్చుని వెళ్లిపోయారు.

పోలింగ్ సరళి పరిశీలించిన పిడిఎఫ్ అభ్యర్థి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళినిపిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరేడ్ల విజయగౌరి పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి అధికారులను పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పిడిఎఫ్ ఎన్నికల శిబిరంలో యుటిఎఫ్ నాయకులతో కలిసి కూర్చొని పోలింగ్ జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు బి.విజయకుమార్, కె.జానకీరావు, సీతయ్య, రాజమణి, శ్యాం, గణేష్, మన్మధ రావు, సిఐటియు నాయకులు ఎన్వై నాయుడు, ఎం.శ్రీనివాసరావు, జానకీ రావు ఆమె వెంట వున్నారు.

గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్ ప్రక్రియ గుమ్మలక్ష్మీపురం మండలం లో ప్రశాంతంగా జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. భద్రగిరి ఎపి రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. 189 మంది ఓటర్లు ఉండగా 183 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96.83 శాతం పోలింగ్ జరిగింది. ఎల్విన్ పేట ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ పర్యవేక్షించారు.

జియ్యమ్మవలసలో...

జియమ్మ వలస మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 91మంది ఓటర్లకు గాను 78 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.75 శాతం ఓటింగ్ జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ హరి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బలిజిపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 48వ పోలింగ్ కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 88 మంది ఓటు హక్కును కలిగి ఉండగా 81 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నిర్వహణ అధికారి కిల్లాడ రత్నకుమారి తెలిపారు.

భామిని: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 44మంది ఓటర్లుగా గానూ 42మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు ఎన్నికలు అధికారి గౌరీ శంకర్ తెలిపారు.

పాచిపెంట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన పోలింగ్ కేంద్రంలో 34మంది ఓటర్లకు గానూ 32మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహశీల్దార్ డి.రవి తెలిపారు.

మక్కువ : మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. స్థానికజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని 55మంది ఓటర్లకు గానూ అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శత శాతం నమోదు కావడంలో జిల్లాలో మక్కువ మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని తహశీల్దార్ షేక్ ఇబ్రహీం వెల్లడించారు.

గరుగుబిల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియను పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. తహశీల్దార్ పి.బాలను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో105 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 95 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బయటకు వస్తున్న సబ్ కలెక్టర్



సీతంపేట : ఓటరు జాబితాను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్



భామిని: పోలింగ్ పూర్తయిన తరువాత సామగ్రితో బయలుదేరిన సిబ్బంది

నిర్మాణ పనులు పూర్తిచేయండి

ప్రజాశక్తి- సీతంపేట

టిటిడి తరపున శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఏజెన్సీ గ్రామాల్లో ఒక్కో దేవాలయ నిర్మాణానికి రూ.10లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని విశాఖపట్నం కనకమహాలక్ష్మి దేవాలయం ఎడ్యుకేటివ్ ఇంజనీర్ వెంకటరమణ అన్నారు. గురువారం మండలంలో ఇసుక గెడ్డ, పత్తి గూడ, కొత్త పాత పనుకువలస, మర్రిగూడ పెదరామ మొగధార తదితర గ్రామాల్లో దేవాలయ నిర్మాణాలను ఆయన పరిశీలించారు ఈ దేవాలయాలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి కాలనీలో అధికంగా నిర్మాణాలు జరిగాయని తెలిపారు. పనులు నాణ్యతగా త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఇటీవల కాలంలో ఉప్పర జమ్మి గ్రామంలో దేవాలయం ప్రారంభమైందని అర్చకులు వేమకోటి సాయి కృష్ణ శర్మ ఈఈ దృష్టికి తీసుకొచ్చారు మిగతావి పూర్తి చేయాలన్నారు. ఈయనతో పాటు ఎఇలు సురేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలంలోని అలమండ సచివాలయాన్ని గురువారం ఎంపిడిఒ శంబంగి రమేష్ ఆకస్మికంగా సందర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న పలు సర్వేలపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పథకాన్ని పంపిణీ చేసే సమయంలో పింఛనదారులతో వ్యవహరించే తీరుపై జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఆయన కొన్ని సూచనలు సలహాలు సిబ్బందికి ఇచ్చారు. ఉదయం 6 గంటల నుంచి పంపిణీ కాకుండా 7 గంటల నుంచి ప్రారంభించాలని ఆయన సచివాలయ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అనంతరం అప్పన్నదొరవలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.



చెత్త తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

స్వచ్ఛ పార్వతీపురం లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రం లో ఉన్న పార్వతీ పురం పట్టణాన్ని స్వచ్ఛ పార్వతీ పురం లక్ష్యం గా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న పారిశుధ్య నిర్వహణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్వతీపురాన్ని స్వచ్ఛ పార్వతీపురం దిశగా ఉండేందుకు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు అన్ని వార్డులలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు.

వైద్య శిబిరానికి స్పందన భేష్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దుగ్గేరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గురువారం పార్వతీపురం ఎఎస్‌పి అంకిత సురాన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కమ్యూనిటీ పోలీస్ సింగ్‌లో భాగంగా గిరిజనులతో మమేకమయ్యేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సుమారు 500 మందికి పైగా గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వృద్దులకు, మహిళలకు, వికలాంగులకు ఆమె చేతుల మీదుగా దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గిరిజన యువతలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు గుంట భద్ర, అలుగురువు, బహుజోల, దిగువ మెండంగి, తాడిపుట్టి యువతకు వాలీబాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మక్కువ ఎస్ఐ వెంకటరమణ, శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సాహితీ, జేమ్స్‌హాస్పిటల్ వైద్య బృందం, సిఆర్పిఎఫ్ బెటాలియన్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామపెద్దలు యువత పాల్గొన్నారు.



నిత్యవసరాలను పంపిణీ చేస్తున్న ఎఎస్‌పి అంకిత సురాన

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలో చెత్తను జెసిబి ద్వారా తొలగిస్తున్నారు. కాలువల నుంచి తీసిన చెత్తను ట్రాక్టర్ ద్వారా వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్లు ఇఒ ఎం.రవి గురువారం తెలిపారు. వీరఘట్టం గ్రామంలో వట్టిగడ్డ వంతెన నుండి ప్రియాంక ఫీలింగ్ స్టేషన్ వరకు ఉపాధి హామీ పథకం ద్వారా ఐటిడిఎ పరిరక్షణలో రూ.5.5 కోట్లతో ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులతో పాటు రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించారు. గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేపట్టి ఎక్కడ పనులు అక్కడ నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు చెత్తాచెదారం కాలువలో పడిపోవడం వల్ల ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోవడంతో వాటిపై దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ఈ కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారి అభివృద్ధి పనులు చేసిన గుత్తేదారే ఇరువైపులా ఉన్న కాలువలో పడిన చెత్తను తొలగించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు లేకపోవడంతో ప్రస్తుతం మేజర్ పంచాయతీ అధికారులు చెత్తను తొలగించేందుకు కుస్తీలు పడుతున్నారు.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న ఇఒ రవి

ఆశ్రమ పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు ఎండిడి అన్నదొర గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించారు. పాఠశాల డార్మెంటరీ గదులను, విద్యార్థులకు సాయంత్రం ఇచ్చే అల్పాహారాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. తక్కువ సమయం ఉంది గనుక సమయాన్ని వినియోగించుకొని ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా వరిస్తుందని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పి అమల, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎపిఒ చిన్నబాబు

ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామపంచాయతీల్లో ఇంటి పన్ను బకాయి వసూళ్లకు పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగభూషణరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల వారీగా ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబంధించి లక్ష్యాలను నిర్దేశించినట్టు తెలిపారు. ఈ మేరకు నిర్దేశించిన లక్ష్యాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు అధిగమించాల్సి ఉందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిలు వసూళ్ల శతశాతం చేపట్టాల్సి ఉందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చింతల వెంకట కురిమినాయుడు, సూరు శ్రీనివాసరావు, తిరుపతి, భాస్కరరావు, బంటు అప్పారావు, రంభ శశిభూషణరావు, బలగ వెంకటసాయికృష్ణ, బొంతల వైకుంఠ రావు, అడ్డూరి లలితకుమారి, అల్లు రమేష్, దత్తి సురేష్ కుమార్, తది తరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ నాగభూషణరావు

మృతదేహాన్ని తరలించేందుకు అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ వీధిలో ఎవరు మృతి చెందినా పాడిని తీసుకు వెళ్ళేందుకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని, మండల కేంద్రంలోని ఎల్లంకి వీధికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి రహదారి ఇరుకుగా ఉండడంతో పాటు ఇటీవల కాలంలో రహదారికి మధ్యలో కాలువ తవ్వకాలు జరపడం వల్ల రాకపోకలు జరిగేందుకు మరిన్ని అవస్థలు పడవలసి వస్తుందన్నారు. రహదారిపై పలకలు లేకపోవడంతో పొరపాటున అడుగు తప్పిన కాలువలో పడిపోవాల్సిందేనని వీధిలోనికి వెళ్ళేందుకు సరైన మార్గం లేదని, గత నెల 27వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతి పత్రం కూడా అందజేశామని తెలిపారు. అయినప్పటికీ ఏ విధమైన చర్యలూ లేకపోవడంతో గురువారం వీధిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు, స్పందించి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని, స్థానికులు కోరుతున్నారు.



మృతదేహాన్ని తరలించేందుకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ, తదితరులు

శాస్త్రవేత్తల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తల బయోగ్రఫీనా వారు ఫోటోలతో సహా ముద్రణ చేయించిన జిల్లా సైన్స్ అధికారి జి లక్ష్మణరావు రూపొందించిన పోస్టర్‌ను గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ తిరుపతి నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి పోస్టర్లతో శాస్త్రవేత్తల గొప్పతనం తెలియజేయడం వల్ల వారిలో ఆలోచన ధోరణి మారి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరూ ఇటువంటి కార్యక్రమాలను చేపట్టి పిల్లల్లో మంచిని ప్రేరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫ్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎన్జిసి కోఆర్డినేటర్ జి రాజు తదితరులు ఉన్నారు.



నగదు బహుమతిని అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

వాలీబాల్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - సీతానగరం

ఎల్‌విఎన్ సంస్థ అధినేత, పెదభోగిలి ఉప సర్పంచ కె.అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ మేరకు విజేతలకు గురువారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర విజేతలకు బహుమతు అందజేశారు. మొదటి బహుమతి పెదబోగిలి వాలీబాల్ టీమ్‌కు రూ.5వేలు, రెండో బహుమతి సుంకర వీధికి రూ.3వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకుల్లో క్రీడలు ఆడడం ఎంతో మంచిదని, గ్రామస్థాయిలో క్రీడలు వల్ల వారిలో సామర్థ్యం బయటకు వస్తాయన్నారు. కార్యక్రమంలో పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ, మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు, మండల టిడిపి కార్యదర్శి రౌతు వేణుగోపాలనాయుడు, నాయకులు పెంట సత్యంనాయుడు, సాల హరిగోపాలరావు, శ్రీనివాసరావు, బి.చిరంజీవిలు, బి.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.